క్లుప్తంగా

ఘనంగా సాయిబాబా ఆలయ వార్షికోత్సవం



సాయిబాబా ఆలయంలో సామూహిక వ్రతాలు ఆచరిస్తున్న భక్తులు

గుండాల : మండల కేంద్రంలోని శ్రీ షిర్డీ సాయిబాబా ఆలయంలో సాయిబాబా అష్టాదశ వార్షిక మహోత్సవాన్ని శనివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా హోమం, సామూహిక వ్రతాలు ఆచరించారు. అనంతరం అన్నదానం నిర్వహించారు. కార్యక్రమంలో మోత్కూరు మార్కెట్ కమిటీ చైర్మన్ నూనెముంతల విమలవెంకటేశ్వర్లు, కృష్ణయ్య, సిద్దారెడ్డి, శ్రీనివాస్, రమేష్, మల్లయ్య, వెంకన్న, రామచంద్రయ్య, వెంకటరెడ్డి, శ్రీనివాస్‌శర్మ, వరలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

తహసీల్దార్ కార్యాలయం ఏర్పాటుకు స్థల పరిశీలన



స్థల పరిశీలన చేస్తున్న అధికారులు

అడ్డగూడూరు: అడ్డగూడూరు మండల కేంద్రంలో తహసీల్దార్ కార్యాలయం నిర్మాణానికి ఆర్ఐ ఉపేందర్ ఆధ్వర్యంలో శనివారం మండల కేంద్రంలో సర్వే నంబర్ 267లో స్థల పరిశీలన చేశారు. సర్వే నివేదికను తహసీల్దార్‌కు అందజేయనున్నట్లు ఆర్ఐ తెలిపారు. కార్యక్రమంలో సర్వేయర్ శ్రీకుమార్, సిబ్బంది సోమయ్య ఉన్నారు.

సర్వేకు సహకరించాలి

రాజాపేట: ఇందిరమ్మ ఇండ్ల సర్వేకు ప్రజలు సహకరించాలని రాజాపేట మండల ప్రత్యేక అధికారి శ్యాంసుందర్ శనివారం ఒక ప్రకటనలో కోరారు. మండల కేంద్రంలో 1,083 దరఖాస్తులు రాగా ఇప్పటి వరకు 742 ఇండ్ల సర్వే పూర్తయినట్లు తెలిపారు. సోమవారం రోజున గడువు ముస్తున్న సందర్భంగా మిగతా ప్రజలు అందుబాటులో ఉండి సర్వేకు సహకరించాలని ఆయన కోరారు.

సైబర్ నేరాలపై అవగాహన



అవగాహన కల్పిస్తున్న ఎస్ఐ నాగరాజు

మోత్కూరు : మోత్కూరు మున్సిపల్ కేంద్రంతో పాటు పాటిమట్ల ఎక్స్‌రోడ్డు వద్ద శనివారం గంజాయి, మత్తు పదార్థాలు, సైబర్ నేరాలపై ప్రజలకు ఎస్ఐ డి.నాగరాజు అవగాహన కల్పించారు. అపరిచితుల మొబైల్స్ నుంచి వచ్చే ఫోన్ కాల్స్‌కు స్పందించ వద్దని, ఓటీపీలు, బ్యాంకు అకౌంట్లు , ఆధార్ కార్డుల నంబర్లు చెప్ప వద్దని ఆయన సూచించారు. గంజాయి, మత్తు పదార్థాలకు బానిసలు కావొద్దని విద్యార్థులు, యువతకు సూచించారు.

పేద విద్యార్థినికి రూ.50వేల ఆర్థికసాయం



నగదు అందిస్తున్న ఎమ్మెల్యే సామేల్

మోత్కూరు : మండలంలోని దాచారం గ్రామంలో పేద కుటుంబానికి చెందిన కామిండ్ల వెంకన్న కూతురు పల్లవి ఉన్నత చదువుల నిమిత్తం శనివారం తుంగతుర్తి ఎమ్మెల్యే మందుల సామేల్ రూ.50 వేల నగదు అందజేశారు.పల్లవికి ఆర్థిక సహకారం అందించాలని గ్రామ మాజీ సర్పంచ్ జినుకల మల్లయ్య, మాజీ ఉప సర్పంచ్ కప్పల లింగయ్య ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్లడంతో ఆర్థికసాయాన్ని అందజేశారు.

హెచ్‌ఎంపై దాడి హేయమైన చర్య

రాజాపేట : రంగారెడ్డి జిల్లా తుక్కుగూడ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయుడు కంబలి రాములుపై మతోన్మాదులు దాడి చేయడం హేయమైన చర్య అని టీపీటీఎఫ్ సంఘం మండల కన్వీనర్ సత్తిరెడ్డి అన్నారు. శనివారం ఆయన స్థానికంగా విలేకరులతో మాట్లాడారు. సమాజాన్ని తీర్చిదిద్దే ఉపాధ్యాయులపై దాడి చేయడాన్ని తీవ్రంగా ఖండించారు.

మౌనం పాటిస్తూ నిరసన

భువనగిరి : తమ సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ కలెక్టరేట్ ఎదుట సమగ్ర శిక్షా ఉద్యోగులు చేస్తున్న దీక్షలు 18వ రోజుకు చేరాయి. ఇందులో భాగంగా శనివారం ఉద్యోగులు మౌనం పాటిస్తూ నిరసన తెలిపారు. దీక్షలకు ధర్మ సమాజ్ పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు విశారధన్ సంఘీభావం తెలిపి మాట్లాడారు. ఉద్యోగుల తమ సమస్యలను సాధించుకునే వరకు పోరాటం చేయాలని సూచించారు. కార్యక్రమంలో ఉద్యోగుల సంఘం నాయకులు పాండరి, తిరుపతి ఉన్నారు.

‘లోలెవల్’ కష్టాలు తీరేదెన్నడో

- దాతర్‌పల్లి-యాదగిరిగుట్ట మధ్య ఉన్న లోలెవల్ కాజ్‌వేతో ఇబ్బందులు
- చెరువు అలుగు పోసిన ప్రతీసారి రాకపోకలకు అంతరాయం
- హైలెవల్ వంతెన నిర్మించాలని గ్రామస్తుల డిమాండ్





దాతర్‌పల్లి శివారు గొల్లగుడిసెల వద్ద కుంగిన లోలెవల్ కాజ్‌వే, రాకపోకలు సాగిస్తున్న వాహనాలు

యాదగిరిగుట్ట రూరల్: మండలంలోని యాదగిరిగుట్ట–దాతర్‌పల్లి గ్రామాల మధ్య ఉన్న లో లెవల్ కాజ్‌వేతో ప్రయాణికులకు కష్టాలు తప్పడం లేదు. వాగు ఉధృతంగా ప్రవహించే సమయంలో కాజ్‌వే నుంచి నీరు ప్రవహించి రాకపోకలకు అంతరాయం ఏర్పడుతుంది. ప్రజాప్రతినిధులు, అధికారులు స్పందించి హై లెవల్ వంతెన నిర్మించాలని కోరుతున్నారు.

నిత్యం రద్దీగా..

మండలంలోని లప్పానాయక్ తండా,రాళ్లజనగాం ,జంగంపల్లి, దాతర్‌పల్లి గ్రామాల ప్రజలు, విద్యార్థులు, ఉద్యోగులు నిత్యం వివిధ పనుల నిమిత్తం యాదగిరిగుట్టకు రాకపోకలు సాగిస్తుంటారు. ప్రతీరోజు దాతర్‌పల్లి మధిర గ్రామమైన గొల్లగుడిసెల వద్ద ఉన్న లోలెవల్‌కాజ్‌వేను దాటాలంటే ద్విచక్రవాహనాలు ప్రమాదాలకు గురవుతున్నాయి. ప్రస్తుతం గోదావరి జలాలు ప్రవహిస్తుండడంతో మళ్లీ ప్రమాదాలు సంభవిస్తున్నాయని గారమస్తులు పేర్కొంటున్నారు.

గుంతలు కనిపించక..

కాజ్‌వేపై పాకురు ఏర్పడిందని, పైగా కుంగి గుంతలు ఏర్పడ్డాయని ప్రయాణికులు పేర్కొంటున్నారు. నీరు ప్రవహిస్తుండడంతో గుంతలు కనిపించక ప్రమాదాలబారిన పడుతున్నామని ద్విచక్రవాహనదారులు వాపోతున్నారు. గతంలో సుమారు పదిమంది ప్రయాణికులు ప్రమాదాలకు గురై ఆస్పత్రి పాలయ్యారని గ్రామస్తులు పేర్కొంటున్నారు.

గుంతలు కనిపించడం లేదు



గొల్లగుడిసెల గ్రామం నుంచి యాదగిరిగుట్టకు వెళ్లే రహదారిలో ఉన్న లో లెవల్ కాజ్‌వేపై ప్రమాదాలు సంభవిస్తున్నాయి. చెరువు నిండి అలుగు పోసిన ప్రతీసారి నీళ్లు కాజ్‌వేపై నుంచి వెళుతున్నాయి. దీంతో కాజ్‌వే అంతా నీటితో పాకురు పట్టింది. కాజ్‌వే పైన గుంతలు ఉండడంతో అవి కనపడక ప్రమాదాలు జరుగుతున్నాయి.

– సుక్కల కృష్ణ, దాతర్‌పల్లి

ప్రభుత్వ విప్ దృష్టికి తీసుకెళ్లాం



దాతర్‌పల్లి గ్రామ పరిధిలో హై లెవల్ వంతెన నిర్మించాలని ప్రభుత్వ విప్ బీర్ల అయిలయ్య దృష్టికి తీసుకెళ్లాం. గోదావరి జలాల ఉధృతి తగ్గగానే పనులు మొదలు పెడతామని చెప్పారు. చెరువు నిండి అలుగు పోస్తే ప్రయాణాలు సాగించలేకపోతున్నాం. వరద ఉధృతి ఎక్కువైతే మండల కేంద్రానికి వెళ్లలేకపోతున్నాం.

– కాల్నె భాస్కర్, మాజీ ఉపసర్పంచ్, దాతర్‌పల్లి

ప్రతి ఎకరాకు సాగునీరు అందించడమే లక్ష్యం

- భువనగిరి ఎమ్మెల్యే కుంభం అనిల్‌కుమార్‌రెడ్డి



కాల్వ పనులను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే కుంభం అనిల్‌కుమార్‌రెడ్డి

భువనగిరి : ప్రతి ఎకరాకు సాగునీరు అందించడమే ప్రభుత్వ లక్ష్యమని భువనగిరి ఎమ్మెల్యే కుంభం అనిల్‌కుమార్‌రెడ్డి పేర్కొన్నారు. శనివారం తుర్కపల్లి మండలంలోని పల్లెపహాడ్ గ్రామం వద్ద కొండపోచమ్మ సాగర్ నుంచి వచ్చే కాల్వకు సంబంధించి 5కిలో మీటర్ల కాల్వ పనులను పరిశీలించి మాట్లాడారు. పల్లెపహాడ్ గ్రామ వద్ద కాల్వ పనులు పూర్తయితే అక్కడి నుంచి రుస్తాపూర్, పెద్దతండా, భువనగిరి మండలంలోని వడపర్తి, అనంతారం, తాజ్‌పూర్, హన్మాపురం నుంచి భువనగిరి చెరువు ద్వారా మండలంలోని వివిధ గ్రామాలకు సాగునీరు అందించడంతో పాటు బీబీనగర్ మండలానికి సైతం నీరు అంతుందని తెలిపారు. కార్యక్రమంలో భువనగిరి మున్సిపల్ చైర్మన్ వెంకటేశ్వర్లు, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ అవెస్ చిస్తీ పాల్గొన్నారు.

కాంగ్రెస్ సీనియర్ నాయకుడికి నివాళి

వలిగొండ : మండలంలోని గోపరాజుపల్లికి చెందిన కాంగ్రెస్ సీనియర్ నాయకుడు నీలం బాపురావు అనారోగ్యంతో మృతిచెందారు. శనివారం భువనగిరి ఎమ్మెల్యే కుంభం అనిల్ కుమార్‌రెడ్డి ఆయన స్వగృహంలో మృతదేహానికి నివాళులర్పించి కుటుంబ సభ్యులను పరామర్శించారు. అనంతరం మండలంలోని పహిల్వాన్‌పురంలో బండారి శ్రీరాములు, నెమిలకాల్వలో వంగాల నర్సమ్మ మృతిచెందడంతో వారి కుటుంబాలను కూడా ఎమ్మెల్యే పరామర్శించారు. అదే విధంగా సీపీఎం జిల్లా కార్యదర్శి ఎండి జహంగీర్, మండల కార్యదర్శి సిర్పంగి స్వామి కూడా బాపురావు మృతదేహానికి నివాళులర్పించారు. కార్యక్రమంలో భీమానాయక్, వాకిటి అనంతరెడ్డి, పాశం సత్తి రెడ్డి, నూతి రమేష్, బెలిద నాగేశ్వర్, సామ రాం రెడ్డి, బాతరాజు బాలనర్సింహ తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వం మాట నిలుపుకోవాలి

చౌటుప్పల్ : రాష్ట్ర ప్రభుత్వం తెలంగాణ ఉద్యమకారులకు ఇచ్చిన మాట నిలుపుకోవాలని ఉద్యమకారులు బోయ లింగస్వామి, కట్టెల లింగస్వామి, నల్ల అరుణ్‌కుమార్, గరిశె మహేష్ కోరారు. శనివారం స్థానికంగా నిర్వహించిన సమావేశంలో వారు మాట్లాడారు. ఉద్యమకారులకు ఇంటిస్థలం, నగదు అందివ్వాలని కోరారు. అదే విధంగా అన్ని రంగాల్లో 5శాతం రిజర్వేషన్ కల్పించాలన్నారు. హామీలను అమలు చేస్తూ తక్షణమే జీఓ విడుదల చేయాలని డిమాండ్ చేశారు.

ఆకట్టుకున్న వైజ్ఞానిక ప్రదర్శన



ప్రదర్శనను తిలకిస్తున్న విద్యార్థులు, తల్లిదండ్రులు

భూదాన్‌పోచంపల్లి: మండలంలోని జూలూరు, కప్రాయిపల్లి గ్రామాల్లో శనివారం బీబీనగర్‌లోని కిడ్స్ కింగ్‌డమ్ గ్రామర్ హైస్కూల్ ఆధ్వర్యంలో నిర్వహించిన వైజ్ఞానిక ప్రదర్శన ఆకట్టుకుంది. ఆరోగ్యం, పౌష్టికాహారం వాటి ప్రభావాలను తెలియజేసే పలు ప్రదర్శనలు ఏర్పాటు చేశారు. గ్రామీణ ప్రజల్లో ఆరోగ్యంపై అవగాహన కల్పించేందుకు ఊరూరా ఆరోగ్య సమ్మేళనాల పేరిట వైజ్ఞానిక ప్రదర్శనలు ఏర్పాటు చేస్తున్నామని పాఠశాల కరస్పాండెంట్ కేవీ మధుసూదన్‌రెడ్డి తెలిపారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ బీవీకే రాజు, పంచాయతీ సెక్రటరీ రఫీ, రిటైర్డ్ హెచ్‌ఎం జెల్ల వెంకటేశం, ఉపాధ్యాయులు మోహన్‌దాసు, కావ్యారెడ్డి, సుజాత, సునీల్, సుధాకర్, దుర్గాభవానీ, స్వప్న, మార్కెట్ కమిటీ డైరెక్టర్ రేనిగుంట్ల లాలయ్య, మాజీ సర్పంచ్ గోడళ్ల ప్రభాకర్ పాల్గొన్నారు.

బూత్ కమిటీల బలోపేతానికి కృషి



అశోక్ గౌడ్‌ను సన్మానిస్తున్న నాయకులు

మోత్కూరు : బీజేపీ బూత్ కమిటీల బలోపేతంతోనే పార్టీ బలంగా ఏర్పాటవుతుందని బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి ఊట్కూరు అశోక్ గౌడ్ అన్నారు. శనివారం జరిగిన మోత్కూరు, గుండాల బూత్ కమిటీల అధ్యక్షులతో ఆయన మాట్లాడారు. బూత్ కమిటీల బలోపేతంతో స్థానిక సంస్థల ఎన్నికల్లో విజయం సాధించే అవకాశం ఉందన్నారు.అనంతరం పార్టీ నాయకులు అశోక్ గౌడ్‌ను ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో బీజేపీ నాయకులు గుజ్జ సోమనర్సయ్య, పోచం సోమయ్య, గౌరు శ్రీనివాస్, ఏనుగు జితేందర్‌రెడ్డి, రావుల మల్లేష్, కందుకూరి ప్రకాష్, అన్నెపు సత్యనారాయణ, సందీప్ తదితరులు పాల్గొన్నారు.

రెవెన్యూ డివిజన్ చేయాలని సీఎంకు పోస్టుకార్డులు



పోస్టుకార్డులు చూపిస్తున్న విద్యార్థులు

మోత్కూరు : మోత్కూరు కేంద్రంగా రెవెన్యూ డివిజన్ ఏర్పాటు చేయాలని బీసీ రిజర్వేషన్ సాధన సమితి రాష్ట్ర అధ్యక్షుడు బుర్ర శ్రీనివాస్‌గౌడ్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. శనివారం మోత్కూరులోని ప్రభుత్వ జూనియర్ కళాశాల విద్యార్థులచే బీసీ రిజర్వేషన్ సాధన సమితి ఆధ్వర్యంలో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి పోస్టుకార్డులు పంపించారు. ఈ సందర్భంగా శ్రీనివాస్ గౌడ్ మాట్లాడుతూ రెవెన్యూ డివిజన్ లేక పోవడంతో పేద, మధ్య తరగతి విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. మోత్కూరుతో పాటు ఆత్మకూరు(ఎం), గుండాల, అడ్డగూడూరు,మోటకొండూర్ మండలాలను కలిపి మోత్కూరు కేంద్రంగా రెవెన్యూ డివిజన్ ఏర్పాటు చేయాల్సిన బాధ్యత రాష్ట్ర ప్రభుత్వంపై ఉందన్నారు. ఈ కార్యక్రమంలో బీసీ రిజర్వేషన్ సాధన సమితి జిల్లా నాయకులు కలిమెల నర్సయ్య, నిలిగొండ మచ్చగిరి, రమేష్, నరేష్, స్వాతి, సంధ్య, శ్వేత తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులు ఆత్మస్థైర్యంతో చదివితేనే రాణిస్తారు



మాట్లాడుతున్న ప్రిన్సిపాల్ లక్ష్మీకాంత్‌కుమార్

వలిగొండ : విద్యార్థులు ఆత్మస్థైర్యంతో చదివితేనే రాణించగలుగుతారని మండల కేంద్రంలోని జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ లక్ష్మీకాంత్ కుమార్ అన్నారు. శనివారం మండల కేంద్రంలోని వెంకటేశ్వర ప్రభుత్వ జూనియర్ కళాశాలలో నిర్వహించిన అర్టుఫుల్ నెస్ అవగాహన కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. విద్యార్థులు ఏకాగ్రతతో విద్యను అభ్యసించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో అధ్యాపకులు పరుశురాములు,గణేష్, వెంకటాచారి, మురళి, విజయ్ కుమార్, సైదా, రవి, గోపీనాథ్, ఆనంద్, స్వప్న, మృదుల పాల్గొన్నారు.

పీహెచ్‌సీ భవనాన్ని పూర్తి చేయాలి



పీహెచ్‌సీ భవనాన్ని పరిశీలిస్తున్న బీజేపీ నాయకులు

చౌటుప్పల్ రూరల్: మండలంలోని దామెరా గ్రామంలో అసంపూర్తిగా ఉన్న ప్రాథమిక ఆరోగ్య కేంద్రం భవన నిర్మాణ పనులను త్వరగా పూర్తి చేయాలని బీజేపీ నియోజకవర్గ కన్వీనర్ దూడల భిక్షం డిమాండ్ చేశారు.అసంపూర్తిగా ఉన్న భవన నిర్మాణ పనులు శనివారం ఆయన పరిశీలించి మాట్లాడారు. కార్యక్రమంలో బీజేపీ నాయకులు కంచర్ల గోవర్ధన్‌రెడ్డి, పోలోజు శ్రీధర్‌బాబు, వెంకటేశం, చిరంజీవి పాల్గొన్నారు.

శబరిమలకు బయలుదేరిన అయ్యప్ప స్వాములు

వలిగొండ : మండలంలోని ముద్దాపురం గ్రామానికి చెందిన అయ్యప్ప మాలధారులు శనివారం స్థానిక ధర్మపురి లక్ష్మీనరసింహస్వామి ఆలయంలో ఇరుముడి కట్టుకుని శబరిమలకు యాత్రకు బయలుదేరారు. అంతకుముందు పూజారి డింగిరి శేషాచారి ఆధ్వర్యంలో హోమం, గణపతి పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో వాకిటి వెంకట్ రెడ్డి, మీసాల ముత్యాలు, జక్క వెంకట్‌రెడ్డి, కందాటి నర్సిరెడ్డి, కందాటి నిఖిల్ రెడ్డి, సురేష్, మల్లేష్, రఘు పాల్గొన్నారు.



ఇరుముడితో అయ్యప్ప మాలధారులు

చర్చి నిర్మాణ పనులు ఆపాలని వినతి



వినతిపత్రం ఇస్తున్న చీకటిమామిడి గ్రామస్తులు

బొమ్మలరామారం : మండలంలోని చీకటిమామిడి గ్రామంలో అనుమతి లేకుండా చేపట్టిన చర్చి నిర్మాణ పనులను ఆపాలని శనివారం తహసీల్దారు శ్రీనివాసరావుకు గ్రామస్తులు వినతిపత్రం అందజేశారు.ప్రభుత్వం నుంచి ఏలాంటి అనుమతులు తీసుకోకుండా 506 సర్వే నంబరులోని భూమిలో పిల్లర్లు, బేస్‌మెట్ లెవల్ వరకు నిర్మాణం చేశారని తహసీల్దారుకు వివరించారు.

మాజీ ప్రధాని మన్మోహన్ సింగ్‌కు నివాళి



భువనగిరి : కాంగ్రెస్ మండల కమిటీ ఆధ్వర్యంలో మాజీ ప్రధానికి నివాళులర్పిస్తున్న నాయకులు

భువనగిరి : మాజీ ప్రధాని మన్మోహన్ సింగ్ మృతికి శనివారం కాంగ్రెస్ మండల కమిటీ ఆధ్వర్యంలో పట్టణంలోని పాత బస్టాండ్‌లో ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన దేశానికి చేసిన సేవలను కొనియాడారు. కార్యక్రమంలో నాయకులు మండల కమిటీ అధ్యక్షుడు ఎలిమినేటి కృష్ణారెడ్డి, మాజీ ఎంపీపీ నరాల నిర్మల, పాశం శివానంద్, జిల్లా అవెస్ చిస్తీ, చిక్కుల వెంకటేష్, మాజీ సర్పంచ్‌లు నానం కృష్ణ, జిలుగు సతీష్‌పవన్, శ్రీనివాస్, బాబురావు, ఫకీర్‌కొండల్‌రెడ్డి, మహేందర్, స్వామి, అశోక్, మంగ ప్రవీణ్ పాల్గొన్నారు.

ఆటో యూనియన్ ఆధ్వర్యంలో..

జై భీమ్ ఆటో డ్రైవర్ వెల్ఫేర్ సొసైటీ ఆధ్వర్యంలో పట్టణంలో మాజీ ప్రధాని మన్మోహన్ సింగ్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో యూనియన్ నాయకులు కొమ్ము జగదీష్‌బాబు, కర్తాల శ్రీనివాస్, ఎలవర్తి శ్రీనివాస్, గూడా నర్సింగ్‌రావు, ఉపేందర్, నవీన్, రాములు, మధు పాల్గొన్నారు.

రామన్నపేట : మాజీ ప్రధానమంత్రి మన్మోహన్‌సింగ్ మృతికి సంతాపం తెలుపుతూ మండలకేంద్రంతో పాటు వెల్లంకి గ్రామంలో కాంగ్రెస్ నాయకులు నివాళులు అర్పించారు. ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి మౌనం పాటించారు. మన్మోహన్‌సింగ్ మరణం దేశానికి, కాంగ్రెస్‌పార్టీకి తీరని లోటని తెలిపారు. కార్యక్రమంలో పట్టణ, గ్రామశాఖల అధ్యక్షుడు ఎండీ జమీరొద్దీన్, అయిటిపాముల పెద్దులు, మాజీసర్పంచ్ తాళ్లపల్లి సత్తిరెడ్డి, వనం చంద్రశేఖర్, ఆముద లక్ష్మణ్, మీర్జా అస్లాంబేగ్, గురుకు శివ, పున్న అమరేందర్, కొమ్ము శేఖర్, పోచబోయిన స్వామి, నకిరేకంటి రవిందర్, పున్న అంజయ్య, సాగర్ల సైదులు, వనం నర్సింహ, రావిటి రమేష్, భిక్షం, నవీన్ పాల్గొన్నారు.

మహిళా కాంగ్రెస్ ఆధ్వర్యంలో..

జిల్లా మహిళా కాంగ్రెస్ ఆధ్వర్యంలో వినాయక చౌరస్తా వద్ద మాజీ ప్రధాని మన్మోహన్ సింగ్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో పార్టీ రాష్ట్ర ఇంచార్జి కో ఆర్డినేటర్ నీలం పద్మ, మాజీ కౌన్సిలర్ మంజుల, స్వరూప, రజిత, లక్ష్మి, నీరజ, స్వాతి, పద్మ పాల్గొన్నారు.

అడ్డగూడూరు: కాంగ్రెస్ పార్టీ గ్రామ శాఖ అధ్యక్షుడు గోవర్ధన్‌రెడ్డి ఆధ్వర్యంలో మండలంలోని చిన్నపడిశాల గ్రామంలో శనివారం మాజీ ప్రధాని మన్మోహన్‌సింగ్ చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. ఆయన సేవలను కొనియాడాదిరు. కార్యక్రమంలో నాయకులు బుషిపాక చెన్నయ్య, గుడాల మాధవరెడ్డి, పెద్దమల్లయ్య, అమర్ సోమయ్య పాల్గొన్నారు.



రామన్నపేట : నివాళులర్పిస్తున్న నాయకులు



రామన్నపేట మండలం వెల్లంకిలో..



భువనగిరి : ఆటో యూనియన్ ఆధ్వర్యంలో..

అధికారులు సమన్వయంతో పనిచేయాలి



మాట్లాడుతున్న మండల ప్రత్యేక అధికారి గోపాల్

ఆలేరురూరల్ : అధికారులు సమన్వయంతో పనిచేస్తూ ప్రజా సమస్యలు పరిష్కరించాలని ఆలేరు మండల ప్రత్యేక అధికారి గోపాల్ సూచించారు. ప్రత్యేక అధికారి గోపాల్ అధ్యక్షతన శనివారం స్థానిక మండల అభివృద్ధి అధికారి కార్యాలయంలో సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఆయా గ్రామాల్లో ప్రజలు ఎదుర్కొంటున్న విద్యుత్, ఉపాధి హామీ, సంక్షేమ పథకాలు, ఇందిరమ్మ ఇళ్ల సర్వేకు సంబంధించిన పనులపై సమీక్షించారు. మిషన్ భగీరథ ద్వారా వచ్చే నీరు పరిశుభ్రంగా ఉండేలా చూడాలన్నారు. కార్యక్రమంలో ఎంపీడీఓ సత్యాంజనేయ ప్రసాద్, తహసీల్దార్ అంజిరెడ్డి, ఏఈఓ శ్రీనివాస్, ఏపీఎం మీన పాల్గొన్నారు.

నల్లా కనెక్షన్ పనులు అడ్డగింత

బొమ్మలరామారం : మండలంలోని రంగాపూర్‌లో ఓ ఫామ్‌హౌస్‌కు మిషన్ భగీరథ నల్లా కనెక్షన్ ఇవ్వడాన్ని శనివారం గ్రామస్తులు అడ్డుకున్నారు. మిషన్ భగీరథ నీళ్లు ఫామ్‌హౌస్‌కు మళ్లించడానికి యత్నించడంపై గ్రామస్తులు ఆగ్రహం వ్యక్తం చేశారు.పంచాయతీ కార్యదర్శి, మిషన్ భగిరథ అధికారులతో గ్రామస్తులు వాగ్వాదం చేయడంతో తాత్కలికంగా పైప్‌లైన్ పనులు నిలిచిపోయాయి.

రగ్బీ పోటీలకు ఎంపిక

రామన్నపేట : మండలంలోని వెల్లంకి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు చెందిన గూని రిబ్కా జాతీయ స్థాయి రగ్బీ పోటీలకు ఎంపికైనట్లు పాఠశాల ప్రధానోపాధ్యాయుడు సురేందర్‌రెడ్డి తెలిపారు. పాఠశాలలో 9వ తరగతి చదువుతున్న రిబ్కా ఈ నెల 30 నుంచి జనవరి 5తేదీ వరకు బిహార్‌లో జరిగే జాతీయస్థాయి అండర్–14పోటీల్లో తెలంగాణ రాష్ట్ర జట్టు తరపున ఆడనుందని తెలిపారు. జాతీయస్థాయి పోటీలకు ఎంపికైన రిబ్కాను సీనియర్ ఉపాధ్యాయులు సత్తిరెడ్డి, యాదగిరి, పారిజాత, హేమలత, నర్మద, ఉమామహేశ్వరి, స్వప్న పీడీ రేణుక అభినందించారు.



రిబ్కాను అభినందిస్తున్న ఉపాధ్యాయులు

కరాటే, జూడోతో క్రమశిక్షణ



కరాటే, జూడో పోటీలకు ఎంపికైన విద్యార్థులు

మోత్కూరు : కరాటే, జూడోతో క్రమశిక్షణ అలవడుతుందని జూడో అసోసియేషన్ జిల్లా సెక్రెటరీ బాలరాజు అన్నారు. మోత్కూరు మున్సిపల్ కేంద్రంలోని సాయి చైతన్య హైస్కూల్‌లో శనివారం జూడో అసోసియేషన్ ఆధ్వర్యంలో జిల్లా స్థాయి జూడో సబ్ జూనియర్, జూనియర్ పోటీలు నిర్వహించి పలువురిని రాష్ట్రస్థాయికి ఎంపిక చేశారు. వారిలో కె.రామ్ చరణ్, ఎం.మణితేజ్, కె.వినయ్, బి.రాజ్‌కిరణ్, ఆర్.యశశ్రీ, ఎస్.సాక్షి, ఎం.విమలాశ్రీ, వీణ, ఎం.సిరివెన్నెల, ఎం.అక్షిత, ఎం.లక్ష్మిప్రసన్న, ఎం.శివాణి, జి.అంజలి, జి.సంకీర్తనలు రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికయ్యారని తెలిపారు. కార్యక్రమంలో సాయి చైతన్య పాఠశాల కరస్పాండెంట్ బి.రవీందర్ రెడ్డి, కరాటే మాస్టర్ అన్నెపు వెంకట్, పురుగుల శ్రీను, చొల్లేటి నరేష్, ఎస్.సైదులు పాల్గొన్నారు.

గోవు కోసం మహా పాదయాత్ర గొప్ప విషయం

- బీజేపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు గంగిడి మనోహర్‌రెడ్డి



బాలకృష్ణ గురుస్వామిని పరామర్శిస్తున్న గంగిడి మనోహర్‌రెడ్డి, నాయకులు

చౌటుప్పల్ : గోవు కోసం కాశ్మీర్ నుంచి కన్యాకుమారి వరకు మహా పాదయాత్ర నిర్వహించడం గొప్ప విషయమని బీజేపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు గంగిడి మనోహర్‌రెడ్డి తెలిపారు. గోవును జాతీయ ప్రాణిగా ప్రకటించాలని డిమాండ్ చేస్తూ కాశ్మీర్ నుంచి కన్యాకుమారి వరకు మహా పాదయాత్ర చేపట్టిన బాలకృష్ణ గురుస్వామి యాత్ర ఈనెల 25న చౌటుప్పల్ పట్టణ కేంద్రానికి విచ్చేసిన క్రమంలో తీవ్ర అస్వస్థతకు గురయ్యారు. స్థానికంగా ఓ ప్రైవేటు ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నారు. విషయం తెలుసుకున్న మనోహర్‌రెడ్డి స్థానిక బీజేపీ నాయకులతో కలిసి శనివారం ఆయన్ను పరామర్శించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ గోవు బాగుంటేనే భూసారం, ఆరోగ్యం, పర్యావరణం బాగుంటుందన్నారు. తన ఆరోగ్యాన్ని సైతం లెక్క చేయకుండా గోవు కోసం వేలాది కిలోమీటర్ల దూరం పాదయాత్ర నిర్వహించిన బాలకృష్ణ అభినందనీయుడని పేర్కొన్నారు. కార్యక్రమంలో ఆ పార్టీ నాయకులు దూడల భిక్షంగౌడ్, కంచర్ల గోవర్ధన్‌రెడ్డి, చినుకని మల్లేష్, పోలోజు శ్రీధర్‌బాబు, గుజ్జుల సురేందర్‌రెడ్డి, ఊడుగు యాదయ్య, బత్తుల జంగయ్య, ఊడుగు వెంకటేశం, దిండు భాస్కర్, చీకూరి వెంకటేశం, పబ్బు వంశీ, బత్తుల రాజశేఖర్ తదితరులు ఉన్నారు.

పురుగుల మందు డబ్బాతో మహిళల నిరసన



శర్బనాపురంలో పురుగుల మందు డబ్బాతో నిరసన తెలుపుతున్న సరిత, శుభావతి

ఆలేరురూరల్ : తమ భూమిలోకి రాకుండా అడ్డుకుంటున్న వారిపై చర్య తీసుకుని న్యాయం చేయాలని కోరుతూ ఆలేరు మండలం శర్బనాపురానికి చెందిన కొమిరెడ్డి సరిత, కొమిరెడ్డి శుభావతి శనివారం వ్యవసాయ భూమిలో పురుగుల మందు డబ్బాతో నిరసన తెలిపారు. ఈ సందర్భంగా బాధితులు మాట్లాడుతూ తమ పేరు మీద 2020వ సంవత్సరం డిసెంబర్‌లో ఒక్కొక్కరికి 7.37 గుంటల భూమితో ఆర్డీఓ పట్టాదార్ పాసుబుక్కులు జారీ చేశారని తెలిపారు. గతంలో రైతుబంధు తీసుకున్నామని తెలిపారు. తమను భూమిలోకి రాకుండా గ్రామానికి చెందిన కొమిరెడ్డి జనార్దన్‌రెడ్డి అడ్డుకుంటున్నాడని ఆరోపించారు. సమస్యను అధికారుల దృష్టికి తీసుకుపోయినా పట్టించుకోవడం లేదని వాపోయారు. న్యాయం చేయకుంటే పురుగుల మందు తాగి ఆత్మహత్య చేసుకుంటామని హెచ్చరించారు. బాధితులు ఉదయం నుంచి సాయంత్రం వరకు వ్యవసాయ భూమిలో టెంట్‌కింద నిరసన తెలిపి వెళ్లిపోయారు.